# రేపే రాస్తాను...

ఈ నవనాగరక లోకంలో గృహిణికి ఉండవలసిన లక్షణాలు యివీ అని ఏ యువకుడూ చెప్పలేడు. పైపై మెరుగులతో మోసపోయి జీవితాంతం నైరాశ్యంలో మునగడం కన్న, ఇల్లు, సంసారం తీర్చి దిద్దుకోగల యువతిని ఎన్నికచేసే బాధ్యత, పెద్ద వారికే వదిలివేస్తే .... ఇల్లు స్వర్గం మాటెలా ఉన్నా, నరకం మాత్రం కాదు !

డి. త్రినాథరావు

ట్యూబులైట్ల కాంతి మునుగులో కదులుతూంది మార్కెట్టు.

సిగరెట్టు కాలుస్తూ నిలబడ్డ రాజాదృష్టి పూలమ్ముతున్న పూబోడిమీదికి మళ్లింది. అందమైనది కాకపోయినా అనాకారి మాత్రం కాదనుకొన్నాడు. రోడ్డుకు అటు ఆమె, ఇటు తాను. ఎంతో దూరంగా ఉన్నా ఆమె కళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమాయికతను పొందుపరుచుకొని చలిస్తున్నాయి. ముదురు పసుపురంగు నేతచీరమీద ఎర్రని జాకెట్ వేసుకొంది. కంటికి వాజాకుగా కాటుక తీర్చింది. తల సున్నగా దువ్వి ముడిచుట్టి, ముడిమీద నుండి ఎడమభుజం మీదకు వ్రేలాడేలా మల్లెమాల అలంకరించుకొన్నది. రెండు కళ్లమధ్య ప్రారంభమైన నాసిక సన్నగా ప్రాకుతూ వచ్చి చివర ఆకాశాన్ని ధిక్కరిస్తున్నట్లు నిలిచింది.

ఆమెచేతిలో మల్లెమొగ్గలు రకరకాలుగా వంగుతూ వర్తిస్తూ కిందికి జారుతున్న మాలలో చిక్కగా ఇమిడిపోతున్నాయి. ఆమె దృష్టి అంతా మాలమీదనే ఉన్నది. 'ఆ చేతిలోని మల్లెలు బహు అదృష్టం చేసుకొని ఉండాలి. ఆ నాజూకు చేతుల్లో తానుకూడా ఓ మల్లెగా అల్లుకుపోతే, ఎంత హాయిగా ఉంటుంది.' తనువు పులకరించిందతనికి.

ఉచ్ఛ్వాసనిశ్వాసాలకు లయబద్ధంగా ఊగుతున్న ఆమె సౌందర్యం అతని మనస్సులో తుఫాను రేపింది. బిగువైన అవయవ సౌందర్యావలోకనంతో క్షణకాలం ఉన్మత్తుడై పోయాడు రాజా. రకరకాల వాళ్లు దాటిపోతున్నారామెను. కొందరు ఆకలితో, కొందరు ఈర్ష్యతో పరికిస్తున్నారు.ఎవరెలా చూస్తున్నా ఆమె నిర్వికారంగా కూచోవడం రాజాకు ఏదో తెలియని సంతృప్తి కలిగింది.

అనుకోకుండానే అతని పాదద్వయం ఆమె దగ్గిరికి నడిపించింది. తదేకంగా ఆమెనే చూస్తూ నిలిచిపోయాడు. ఎంతసేపటికి మాటా, పలుకు లేకుండా నిలిచిన ఆ విగ్రహాన్ని ఆశ్చర్యంగా పరికించింది ఆ అంగన. కళ్లు టపటప లాడించి "ఏం కావాలండీ?" సప్త స్వరాలు శ్రుతి చేసుకొని మ్రోగినట్లనిపించింది రాజాకు. అతని చూపుల తీక్షణత్వానికి తట్టుకోలేని ఆమె నేత్రాలు చేతిలో అప్పటివరకు ఒయ్యారం ఒలకబోసిన మాలవైపు అయోమయంగా చూసేయి. పరిస్థితి జ్ఞప్తికి వచ్చిన రాజా ఉలిక్కిపడి, "ఆఁ. . . ఆ మాల ఎంత?" కంగారుగా ఆమె చేతిలో మాలను చూపిస్తూ అడిగేడు.

అతని కంగారుకి చిన్నగా నవ్వుకొన్నదామె. చిలిపిగా చూస్తూ, "ఈ మాల అల్లడం ఇంకా పూర్తికాలేదండి." ఈ సారి నిజంగా కంగారుపడి పోయాడు. ఏం చెప్పాలో తోచలేదతనికి. ఎవరేనా తన్ను చూస్తున్నారేమోనని పరికించేడు. పక్కనున్న మరో పూబోడి తన్నే చూస్తూండడంతో గతుక్కుమన్నాడు. అవమానింపబడ్డట్టుగా అనిపించింది. ఆ వస్తున్న కంగారులో, తన్నుతానూ తిట్టుకొన్నాడు. రాజా చూడగానే మూతి ముప్పయిమూడు వంకర్లు తిప్పి దృష్టి మరల్చుకొంది.

"పోనీ, ఆ అల్లినమాల ఎంతో చెప్పు" అని అడిగేడు నిటారుగా నిలబడ్డానికి ప్రయత్నిస్తూ. కిందఉన్న మాలతీసి "మీకు నచ్చినంత ఇవ్వం"డని ముభావంగా అందించింది. రాజా నీరుకారిపోయాడు. మందస్మిత వదనగా చూడాలనీ, అలవోకగా పువ్వు అందిస్తుంటే అందుకోవాలనీ అతని ఆశ. కానీ అలా జరగలేదు. ఎంతసేపటికి అందుకోని అతణ్ణి ప్రశ్నార్థకంగా చూసిందామె.

"ధర చెప్పక నచ్చినంత ఇవ్వమంటే?. . .నే నెప్పుడూ పూలు కొనలేదు."

"మీకు తోచినంత ఇవ్వండి" అంటూ మాల మడిచి చేతికిచ్చింది.

"నాకు నచ్చినంతంటే అయిదు సైసలిస్తాను, సరిపోతుందా?" కొంటెగా ప్రశ్నించాడు.

"సమంజసమని మీరనుకొంటే అంతే తీసుకొంటాను." చాలా నెమ్మదిగా సమాధానం చెప్పిందామె. తెలుగు చక్కగా మాట్లాడుతుంటేఆశ్చర్యపోయాడతను. ఉరుదు మిళితమైన రాజధానిభాష వినడానికి అలవాటుపడ్డాడేమో ఆమె స్వచ్ఛమైన ఉచ్చారణ ముచ్చటవేసింది. జేబునుండి రూపాయి కాయితం తీసి ఇచ్చేడు. చిల్లరతీసి ఇవ్వబోతే రాజా వారిస్తూ "అక్కర్లేదు ఉంచుకో, నాకు నచ్చినంత ఇస్తున్నాను." అన్నాడు.

"ఇదేమిటి. రెండణాల మాలకు రూపాయి ఎవ్వరేనా యిస్తారా?" ఆశ్చర్యపోయిందామె. నలుగురు వింతగా పరికించడంతో రాజా తలవంచుకొని సాగిపోయేడు. "బాబూ!" అని పిలుస్తున్న ఆమెమాట వినిపించుకోకుండా.

* * *

'ఎందుకు కొన్నట్టూ మల్లెల్ని? ఎవరి కిచ్చేందుకు?' బుర్ర గోక్కున్నాడు. ప్రస్తుతం ఒంటరి. ఉద్యోగరీత్యా ఆంధ్రరాజధానిలో మకాం పెట్టేడు. వయస్సులో ఉన్నమనస్సు ఆవేశంతో ఉరకలు వేస్తున్నది. నిలకడన్నదే లేదు. ఒక్కోసారి మరీ అయోమయంగా చూస్తూంది మనసు. 'నీకు కావలిసిందేవిటని' ప్రశ్నిస్తూంది. 'అది తెలిస్తే ఈ ఆరాటం ఎదుకని' అతని జవాబుతోడు నీడయి వెంట నడిచే భాగస్వామి అవసరమనిపిస్తూంది. కాని అది చెప్పుకోలేడు ధైర్యంగా. అతని మనసునుండి ఎప్పుడూ పారిపోతుంటాడు. 'ఇంత పిరికివాడి వేమిట'ని మనసు నిలదీస్తే, 'ఛా ఛా! నేను పిరికివాణ్ణా, నెవ్వర్!' అతని బుకాయింపు!

వివాహం చేసుకోమని ఉత్తరాలమీద ఉత్తరాలు రాస్తున్నారు అతని తల్లిదండ్రులు. పెళ్లిచూపుల తతంగం జరిపి చేసుకోవడం ఎబ్బెట్టుగా అనిపించింది. ప్రేమించి పెళ్లిచేసుకొంటే అదో ఎడ్వంచరనీ, ఆ ఆనందం కలకాలం ఉంటుందనీ తలంపు. అందుకే ఎప్పటికప్పుడు, వాళ్లు పెళ్లివిషయం ప్రస్తావించినా, మాట్లాడక,మామూలుసంగతులు వ్రాస్తూ తప్పించుకు వస్తున్నాడు.


ఆలోచిస్తూ గది చేరుకొన్నాడు. పక్కఇంటి సుశీల వాళ్ల గుమ్మం దగ్గిర నిలబడి ఉంది. తదేకంగా రాజానే చూస్తున్న ఆమె, అతను చూడగానే మొహం తిప్పేసింది. నవ్వు వచ్చింది రాజాకు. అప్పటివరకూ చూస్తూ, తను అటు చూడగానే ఏమీ ఎరగనట్టు ఎటో చూస్తున్నది. రోజూ ఆమె ప్రవర్తించే తీరే అది.

సన్నగా ఎర్రగా ఉండే సుశీల రాజాకు వసంతపు తొలినాడు కోయిలగానం విన్నంత హాయిగా గోచరిస్తూ ఉమెన్సుకాలేజిలో పి. యు. సి. చదువుతూంది. తండ్రి ఆంధ్రాబ్యాంకులో కాషియరు. ఇద్దరు తమ్ముళ్లు. ఇల్లు చాలాశుభ్రంగా ఉంటుంది. గుమ్మాలకు రంగురంగుల బొమ్మలు కుట్టిన కర్టెన్సుంటాయి. రాజాకు వాళ్లని గురించి తెలిసిన సమాచారం ఇంతవరకే.

వాళ్ల కాంపౌండులో ఎఱ్ఱగులాబీలు కోకొల్లలుగా పూస్తాయి. ఆ గులాబీల్లో ఒక గులాబీగా నిలబడే సుశీలను ఎంతసేపు చూసినా తనివి తీరదతనికి. గదితలుపు తీయబోతూండగా చేతిలోని మల్లెమాల జ్ఞప్తికి వచ్చింది. సుశీల దగ్గిరికి విసురుదామనుకొన్నాడు. 'ఏమైనా లేనిపోని గొడవలు వస్తాయేమో!' అని జంకాడతను. ఏం చెయ్యాలీ మాలను? "సుశీ". . . ఇంట్లోనుండి పిలుపు వినబడ్డంతో "వస్తున్నా" నంటూ లోపలికి వెళ్లిపోయింది.

'ఛీ ఛీ. . . వీళ్లమ్మ ఏమిటి పానకంలో పుడకలా? యజ్ఞంలో పిడకలా. . .' ఇంకా ఏమి టేమిటో తిట్టుకొన్నాడు. ఉస్సురంటూ లోపలికి చేరుకొన్నాడు. చేతిలో మాలను శ్రీనివాసుని పటం ముందు పడేసి కుర్చీలో కూలబడ్డాడు.

చిరునవ్వుతో సుశీ అతని ఆలోచనల్లో తావు చేసుకొంది. తిలకంతో, మరునివిల్లులాంటి కనుబొమ్మ



మధ్య గుండ్రని బొట్టు దిద్దుకొని, దొండపండులాటి ఎర్రని పెదవులతో ఆమె నవ్వితే చూడముచ్చటగా ఉంటుంది. దానిమ్మగింజల్లా ఆపలువరుస మెరుస్తూంటే పదేపదే ఆమెను నవ్వించాలనిపిస్తుంది. వెళ్ళేప్పుడు, వచ్చేప్పుడు గుమ్మంలో నిలబడి చూసే సుశీల, పలకరించబోతే సమాధానం చెప్పకుండా పారిపోయే ఆ మనస్తత్వం అవగతం కాలేదు. 'ప్రేమిస్తున్నదా? ప్రేమిస్తే అలా మారుమాట్లాడక జారిపోవడం ఎందుకు? ఒకవేళ అలాంటి అభిప్రాయాలు లేకపోతే తన రాకపోకల సమయాల్లో కచ్చితంగా ఎందుకు హాజరౌతున్నట్టు?' ఇది అతని యోచనలు.

* * *

"తొమ్మిది నలభయి" అని వాచీవంక చూసి అనుకొంటూ ఆఫీసులో అడుగు పెట్టేడు రాజు. ఇంకా ఎవరు వచ్చినట్టు కనిపించలేదు. నిశ్శబ్దంగా ఉంది. భానుని ప్రతాపాగ్నికి అలిసిన రాజు ఫానుస్విచ్ వేసి కుర్చీలో జారగిలబడి కళ్ళు మూసుకున్నాడు.

"గుడ్‌మార్నింగ్ రాజూ ..." స్టెనో మిస్ లత కంఠం విని కళ్ళు తెరవక "మార్నింగ్" అన్నాడు. అటెండెన్సురిజిస్టర్లో సంతకం పెట్టి రాజువేపు తిరిగింది. అతను చలనం లేకుండా ఉండటం చూసి "ఈ రోజు రాజావారు ఊహాలోకాల్లో విహరిస్తున్నట్టున్నారు." నవ్వుతూ ఆట పట్టించిందామె. కళ్ళు తెరిచి ఆమెను చూసేడు.

తెల్లని ఖటావ్ చీర, అదేరకం బ్లౌజు వేసుకొన్నది. రెండు జడలు. దోసగింజ బొట్టు పెట్టుకున్నది. గణపతిశాస్త్రిగారి "విశాలనేత్రాలు" గుర్తుకు వస్తాయి ఆమెకళ్ళు చూడగానే. గుండ్రని మోము, నవ్వితే సొట్టలుపడే బుగ్గలు, మరీ మరీ చూడాలనిపిస్తుంది. ఆ ప్రత్యేకతలో ఆమె మలిచిన శిల్పంలా కనిపిస్తుంది.

"ఏవిటిది? ఈ రోజు శ్రీ శ్రీ రాజుగారు మౌనం వహించి, పరిశీలనలో పడిపోయారు. దెబ్బలు తగలగలవు జాగ్రత్త" గలగల నవ్వేసింది. రాజు ఆమెను కవ్వించాడు.

"అబ్బే, ఏమీలేదు. ఆడవాళ్ళు అలంకరించుకొనేందుకు ఎంత అవస్థపడతారా అని ఆలోచిస్తున్నా."

"ఈనాటి మగవాళ్ళకన్నానా?" ఎత్తిపొడిచింది లత.

"అంటే. . . ." రెట్టించాడు.

"అబ్బే, ఏమీ తెలియని అమాయకులు కదూ! అయితే వినండి. ఈ రోజుల్లో అలంకారం కోసం ఆడవాళ్ళకన్నా మగవాళ్ళే ఎక్కువ అవస్థ పడుతున్నారు. అసలు ఆడవాళ్ళకు ఎంతసేపయినా అలంకరించుకొనే హక్కున్నదంటారు. కానీ మగవాళ్ళు గంటలకొద్దీ అద్దం ముందు నిలబడి ఆడదానిలా. . ."

"ఆఁ ఆఁ . . . ఆగండాగండి. ఆడవాళ్ళు మగవాళ్ళు సమానమేనని సమాన హక్కులు కావాలని వాదించే సబలలేనా ఈ విషయంలో ఆడామగా అంటూ తేడా తీసుకువస్తున్నది?" లతకు నవ్వు వచ్చింది. రాజు నవ్వేశాడు.

"నాతో వాదించేకన్నా మీ కాబోయే శ్రీమతికి తెలియజెప్పండి."

"ఏమిటీ? చెప్పడమే. అందులోను శ్రీమతికి.



సైకిల్ అనుమతి....

—యస్. పాల్

'శంకర్' కార్టూన్లు గుర్తున్న వాడెవడూ అంత ధైర్యం చెయ్యడనే నా నమ్మకం"

పెద్దగా నవ్వేసింది లత. ఆఫీసరు రాకతో ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

లంచ్ టైంలో కాఫీకని లేవబోయిన రాజు దగ్గిరికి లత టైపుచేసిన డ్రాఫ్టు తీసుకువచ్చి 'కంపేర్' చేద్దామని కూచుంది.

ఆఫీసులో చేరింది మొదలు రాజుదగ్గిరే కూర్చుని అన్నీ తెలుసుకుంది. అందుకే అతని దగ్గిర బాగా చనువు. మరెవ్వరి వద్దకు వెళ్లదు. దీనితో ఆఫీసులో గుసగుసలు ప్రారంభమయినా ఎప్పుడో. కానీ ఇద్దరూ పట్టించుకోలేదు. రాజే కొస్త భయపడతాడు. కానీ లత అవేమీ పట్టించుకోలేదు. చిరాకులో విసుక్కొన్నాడంటే రెండు అక్షింతలు నెత్తిన వేసి మరీ చక్కా పోతుంది. రెండు రోజుల పాటు సత్యాగ్రహం సాగిస్తుంది. మళ్లీ బతిమాలించుకొనిగాని మాట్లాడదు. మెల్లిగా సానునయంగా అన్నాడు.

"నేను కాఫీకి వెళ్లేప్పుడే నీవూ రావాలి."

"తాగచ్చు లెద్దూ వెధవకాఫీ. ఐ. టి. వో. అర్జంటుగా తీసుకు రమ్మన్నారు, ప్లీజ్."

"ప్లీజ్ కాదు. నా మొహం. చెబితే విని చావవు." చిన్నగా కేకలేశాడు.

"రాజు నా బాబుగదూ. కోప్పడకు." తప్పలేదతనికి.

ఆమె చదువుతూంటే చూసి తప్పులు దిద్ది ఇచ్చేడు. కాయితాలు చేతపుచ్చుకొని "థాంక్సు రాజూ" అంటూ చిలిపిగా నవ్వుతూ భుజంమీద మెల్లగా చరిచి వెళ్లిపోయింది. నిర్ఘాంతపోయేడు క్షణకాలం! ఆమె చూపుతున్న చనువు ఎలా అర్థం చేసుకోవాలో తోచలేదు, వయస్సు వేడిలోని రాజుకు.

• • •

ఆదివారం మధ్యాహ్నం. రేడియో ఆన్‌చేసి కుర్చీలో చతికిలబడ్డాడు రాజు. హైదరాబాద్‌స్టేషన్ నుండి నాటికేదో వస్తున్నది. మగగొంతు చాలా నిరాశానిస్పృహలతో పలుకుతున్నది.

"........జీవితంలో తిరగలేని చోటులన్నీ తిరిగాను. అలిసిపోయాను సరూ. మంచేదో, చెడేదో తెలియని అయోమయంలో తిరిగాను. నిన్ను కాదని ఎండమావుల్ని చూస్తూ చల్లని నీరు దొరుకుతుందని ఒక తావునుండి మరోవేపుకు పరుగులెత్తాను. మిగిలింది అలసట తప్ప, మరేమి దొరకలేదు. నన్ను నీ ఒడిని చేర్చి నా జీవితానికి సేదనిస్తావా?. . ." జీరబోయింది.

"నా మనస్సులో నిండింది నీ రూపమే బావా! నిన్ను నేను కాదనగలనా?. . . ఆప్యాయంగా ఆదరించింది ఆడగొంతు. "ఎంత చల్లని మాటవి. . .' "ఛట్" అంటూ ఆఫ్ చేశాడు రేడియో. ఏదో బాధగా మూలిగింది హృదయం. తెలియని ఆవేదన ఆవరించింది. 'ఒంటరి జీవితం ఎంత భయంకరంగా ఉంటుంది' లోలోన గొణుక్కున్నాడు.

"దూరపుకొండలు నునుపు"ని తానుకూడా భ్రమిస్తున్నాడా? ఛ ఛ... అది నాటిక, తనది జీవితం. తన జీవితభాగస్వామిని స్వయంగా ఎంచుకోవాలి. నచ్చనిదే చేసుకోడు.

నచ్చడమంటే, ఏ విధంగా ఉంటే నచ్చుతుంది? కాబోయే అర్ధాంగి అందంగా ఉంటే చాలా? ఇద్దరి మాట ఒక్కటిగా జరిగితే స్వర్గసుఖమే. కానీ ప్రతి మాటకు ఎదురు చెప్పి తన ధోరణి తనదిగా ప్రవర్తిస్తే జీవితాంతం అశాంతే ఏ • తుంది. అంతఃసౌందర్యం ఎలా తెలుస్తుంది?

అమాయకంగా చూసే పూబోడి సీత చిరునవ్వులు చిందిస్తూ అతని ముందు కదిలింది. కావాలని ఆమెను పదేపదే చూసేడు. ఆమె అమాయకత్వం, నిండుతనం ఆకర్షించాయి తనను. ఆమెను పక్కన ఊహించుకొంటే ఏమిటో చిరుకుగా తోచింది. 'అయితే ఆమెలాఉండే ముగ్ధ కావాలా? ...' 'ఏమో'. మనస్సు మొద్దుబారింది.

సన్నగా నాజూకుగా గులాబీల్లో గులాబీగా వర్తించే సుశీల. ఆమె బాహ్యసౌందర్యాన్ని చూడగలుగుతున్నాడు కానీ ఆమె మనసు ... ఆఫీసునుండి ఇంటికి రాగానే మధురంగా తన్ను లాలించగలదా? సుఖదుఃఖాలు సమంగా పంచుకోగలదా. ఆమె తనకేమి పట్టనట్టు ప్రవర్తిస్తే సహించలేడు మరి?. . .

చిలిపిగా కవ్విస్తూ చెంపకు చారెడేసి కన్నులున్న లత. లేటెస్టు ఫాషన్సుతో నాగరిక ప్రపంచానికి చిహ్నంగా అలంకరించుకొంటూ. . . తన గృహాన్ని నందనవనంగా తీర్చగలదా? తన అర్ధాంగి ఉద్యోగం చెయ్యడం సుతరామూ ఇష్టం లేదు. వద్దంటే అంగీకరిస్తుందా? లేక "ఇంత సంకుచితమా మీ హృదయం?" అని హేళన చేస్తూ ఎదురు చెబుతుందా?

ఎవరు చెబుతారు తన సందేహాలకు సమాధానాలు? భాగ్యనగరంలో నిత్యం చూస్తున్న 'రంగులప్రపంచం' కృత్రిమమైనదని తెలుసు. పెదవులకు లిప్‌స్టిక్ పూసి, శిఖరంలా జుట్టును నడినెత్తిన ముడివేసి, కంటినుండి చెవులవరకు కాటుక పూసి, హైహీల్సు వేసి నడవలేక జారుతూ, కదిలిపోయేవాళ్లను చూస్తూనే ఉన్నాడు. శరీరంలో సగభాగం నగ్నంగా వదిలివేస్తున్న లలనామణులు చీరలు జారిపోతున్నట్టు లంగా, లోపలకు దోపి కదులుతున్న శృంగారప్రపంచం!. . . ఎంత అసహ్యం!

అవ్వన్ని చూసిన కొత్తలో ఆశ్చర్యంగానూ, తరవాత ఆహ్లాదంగానూ, చివరికి అసహ్యాన్ని రేపాయి అతనిలో. మరి తన సమస్యకు జవాబు? విసుగ్గా లేచి సిగరెట్టు తీసి అంటించాడు.

ఛీ ఛీ. తాను నిశ్చయించుకోలేడు. యౌవనోద్రేకంలో తప్పటడుగు వేస్తే, జీవితాంతం కృశించిపోవాలి. చేతులు కాలిన వెనక చింతించి లాభం లేదు. తెలియని ఆవేదన అలుముకుంది. వేళ్లతో కణతలు నొక్కుకున్నాడు.

తన వశం కాదు. మంచీచెడూ నిర్ణయించుకోలేడు. అనుభవం నాస్తి. జీవితసమరంలో అడుగుపెట్టి అనుభవించినవారిని తోసిరాజనలేదు.

'ఎందుకు వచ్చిన ఆరాటం? ఈ విషయం మీ అమ్మకే వదిలేయ్. గృహాన్ని తీర్చిదిద్దగల కోడల్ని ఎన్నుకొంటుంది' అంది అతని అంతరాత్మ. 'నిజమే. రేపే వ్రాస్తాను!' అనుకొంటూ కుర్చీనుండి పైకి లేచేడు, హాయిగా గాలి పీలుస్తూ. ★